శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## మహానాడు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు : ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, మే 30, ప్రభాతవార్త** కడపలో మూడు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమములో పాల్గొని, విజయవంతం చేసిన జిల్లా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కడపలో ఈ నెల 27, 28, 29 మూడు రోజుల పాటు నిర్వహించిన మహానాడు కార్యక్రమం దిగ్విజయంగా ముగిసిందని, ప్రత్యేకించి మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి జాతీయ అధ్యక్షులుగా ఎన్నిక కావడం సంతోషకర విషయం అన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తకు ఉన్న విలువను ఈ మహానాడు ప్రస్ఫుటం చేసిందన్నారు. యువనేత, మంత్రి నారా లోకేష్ బాబు చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుందని, భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు గొప్ప సలహాలు, సూచనలను అందజేశారన్నారు. ఈ మహానాడులో తొలిసారి ఎంపీగా పాల్గొనడం ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. మహానాడు నిర్వహణలో ఎందరో నేతలు కీలకంగా వ్యవహరించారని, ప్రతి ఒక్కరి కష్టంతో మహానాడు విజయవంతం అయ్యిందన్నారు. రవాణా దగ్గర నుంచి భోజనాల వరకు అన్ని విభాగాలు కలిసి పనిచేయడం తోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. పార్టీ అధినేత ఆదేశాలను అమలు చేస్తూ ముందుకు సాగుతామని, ప్రభుత్వానికి, పార్టీకి మరింత మంచి పేరు తెచ్చేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## మహానాడు విజయవంతం చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు



**కోవూరు, మే 30, ప్రభాతవార్త :** కార్యకర్తల సందడితో మహానాడు పండుగ శోభ సంతరించుకుంది. తెలుగుదేశం కార్యకర్తల పార్టీ అని నిరూపించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. అంగరంగ వైభవంగా పండుగ వాతావరంలో జరిగిన మహానాడు విజయవంతంలో టిడిపి కార్యకర్తల పాత్ర కీలకం అన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఒక ప్రకటనలో మహానాడు విజయానికి కృషి చేసిన కోవూరు నియోజకవర్గ టిడిపి క్షేత్ర స్థాయి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియ చేసారు. పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావంతో పని చేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. మహానాడు స్ఫూర్తిగా కొత్త పాత నాయకులు ఐకమత్యంగా పనిచేసే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానన్నారు. మహానాడు సందర్భంగా స్వచ్ఛందంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తల ఉత్సాహం కోవూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని చాటి చెప్పేలా ఉందని ప్రశంశించారు.

## జూన్ 1వ నుండి రేషన్ దుకాణాల వద్దనే బియ్యం

- ఇన్చార్జి కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మే 30, ప్రభాతవార్త** జూన్ 1వ తేదీ నుండి తెల్ల రేషన్ కార్డుదారులకు రేషన్ దుకాణాల వద్ద బియ్యం ఇవ్వడం జరుగుతుందని ఇన్చార్జి కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. గత మాసం వరకు ఎండియు వాహనాల ద్వారా రేషన్ బియ్యం అందించే వారిని అయితే ప్రభుత్వం ఎండియు వాహనాలు రద్దు చేసినందువల్ల ఇకపై రేషన్ దుకాణాల ద్వారా మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు గమనించి రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ బియ్యం పొందవలసిందిగా తెలియజేశారు. అలాగే 65 సంవత్సరాలు పైబడిన తెల్ల రేషన్ కార్డుదారులు, దివ్యాంగులు జూన్ నెల 1 నుండి 5వ తేదీ వరకు వారి ఇంటి వద్దనే అందించడం జరుగుతుందని ఇన్చార్జి కలెక్టర్ తెలిపారు. ఆదివారాల్లో కూడా దుకాణాల వద్ద బియ్యం అందజేయడం జరుగుతుందని కార్తీక్ తెలిపారు.

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే

- 27 మంది బాధితులకు రూ.24.56 లక్షల రూపాయలు చెక్కులు పంపిణీ



**కందుకూరు, మే30, ప్రభాతవార్త** కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 27 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.24.56 లక్షల రూపాయల చెక్కులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని, రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహ, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, నాదెళ్ళ వెంకట సుబ్బారావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచండి

- కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మే 30 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మద్రాసు బస్టాండ్ కూడలిలోని అన్న క్యాంటీన్ ను కమిషనర్ శుక్రవారం సందర్శించారు. క్యాంటీన్లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని ప్రజలకు అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్థానిక 31వ డివిజన్ తుమ్మల లేఔట్, లాయర్స్ కాలనీ, నిర్మల నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. డివిజన్ పరిధిలోని వివిధ లేఔట్లలో రోడ్లను కొలతలు వేసి మాస్టర్ డేటా ప్లాన్ తో సరి చూసారు. భవనాలకు కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. డివిజన్ వ్యాప్తంగా డ్రైను కాలువల పూడిక తీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక వి.ఆర్ పాఠశాల ప్రాంగణాన్ని కమిషనర్ సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న మైదానం అభివృద్ధి పనులను పరిశీలించి వివిధ సూచనలు జారీ చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మే 30 ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 42.742టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్సికి 50, ఎన్ఎఫ్సికి 250 , పెన్నా డెల్టాకు 3000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 94.796మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## భవిష్యత్ తరాలకి డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యం

### వీఆర్సీ హైస్కూల్‌లో మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి



**నెల్లూరు, మే 30, ప్రభాతవార్త – వైద్యం** యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న నెల్లూరు వీఆర్సీ హైస్కూల్ ఆధునీకరణ పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. భవిష్యత్ తరాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలని సంకల్పంతో రూ.15 కోట్ల వ్యయంతో సిద్ధమవుతున్న సరస్వతీ నిలయాన్ని మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో ఎక్కడ రాజీ లేకుండా పనులు చేస్తున్న ఎన్సీసీ కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసే స్పోర్ట్స్ కోర్టులా డిజైన్‌ను పరిశీలించిన మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ నెల్లూరు నగర నడిబొడ్డులో ఉన్న వీఆర్సీలో చదివిన చాలా మంది ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. ఎందరో ప్రజా సేవకులను ఈ కళాశాల సమాజానికి అందించిందన్నారు. 2014లో తాను.. తన సిబ్బందితో కలిసి 300 మందికి ఐఐటీ కోచింగ్ ఇక్కడే ఇప్పించానని గుర్తు చేసుకున్నారు. అయితే అలాంటి వీఆర్సీ స్కూల్‌ను అవగాహన రాహిత్యంతో గత ప్రభుత్వం మూసేసిందని విచారం వ్యక్తం చేశారు. గత పాలకులకి పరిపాలనలో పక్వత లేదని ఎద్దేవ చేశారు. అసమర్ధ పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధోగతి పాలు చేశారని మంత్రి నారాయణ మండిపడ్డారు. పది లక్షల కోట్ల అప్పును ప్రజలనెత్తిన గత ప్రభుత్వం వేసిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా సుపరిపాలన వైపు ముందుకు దూసుకెళ్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని యువనేత లోకేష్ సంకల్పించారని తెలిపారు. ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామని మంత్రి పిలుపునిచ్చారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీని ఎంఎస్ఈ మార్చి 25 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నామని వెల్లడించారు. అదే విధంగా వీఆర్ హైస్కూల్ పున:ప్రారంభానికి మంత్రి లోకేష్ అనుమతి ఇచ్చారని తెలియజేశారు. భారతదేశంలోనే నంబర్ వన్ స్కూల్‌గా తీర్చిదిద్దబోతున్నామని మంత్రి నారాయణ ఘంటాపథంగా చెప్పారు. వెయ్యి మంది నిరుపేద విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తామని తెలియజేశారు. ఈ క్రమంలో ఇప్పటికే 760 మంది పేద విద్యార్థులను గుర్తించామన్నారు. వీఆర్సీలో చదివే విద్యార్థుల్లో కొన్ని కుటుంబాలను నా కుమార్తెలు, అల్లుళ్ళు దత్తత తీసుకొంటున్నారని వెల్లడించారు. పీ–4 కింద మరికొందరిని దత్తతకు ఆహ్వానిస్తామన్నారు. డీఎస్ఆర్ కంపెనీ అధినేత సుధాకర్‌రెడ్డి గుంటబడిని దత్తత తీసుకోవడం సంతోషదాయకమన్నారు. వీఆర్సీకి ధీటుగా గుంటబడిని తయారు చేస్తామని మంత్రి వెల్లడించారు. నెల్లూరు సిటీలో ఉన్న 54 ప్రభుత్వ పాఠశాలలను కూడా మోడల్ స్కూల్స్‌గా తయారు చేస్తామని తెలియజేశారు. తద్వారా రానున్న కాలంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరుస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. అనంతరం నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా వీఆర్ స్కూల్‌ను మంత్రి పొంగూరు నారాయణ అభివృద్ధి చేస్తున్నారన్నారు. కడు నిరుపేద విద్యార్థుల కోసం మంత్రి నారాయణ చేస్తున్న కృషి అనిర్వచనీయం అని కొనియాడారు. మూడు పూటలా ఆహారంతో పాటు వారికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. మంత్రి నారాయణ ఆలోచనతో వేల మంది పేద విద్యార్థుల తల రాతలు మారబోతున్నాయని చెప్పారు. వీఆర్ స్కూల్‌లో ఎంతో మంది చదువుకున్న చరిత్ర ఉందన్నారు. మంత్రి కుమార్తె షరణికి స్కూల్ పూర్తి బాధ్యతలను అప్పగించడం అభివృద్ధిని స్వాగతించడమేనని రూప్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో పాటు కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, 45వ డివిజన్ ప్రెసిడెంట్ సుజన్, 44వ డివిజన్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, 45వ ప్రెసిడెంట్ చిరంజీవి, బూత్ కన్వీనర్ కార్తిక్, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

ఇన్‌ఛార్జీ కలెక్టర్ కె.కార్తీక్ అధికారులకు ఆదేశం



**నెల్లూరు కలెక్టరేట్, మే 30, ప్రభాతవార్త** యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఇన్చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు, కాంపిటీషన్లు, ట్రైనింగ్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో సమీక్ష చేశారు.

❖ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు తమ పొరుగు వారితో యోగా పట్ల అవగాహన, ఆసక్తి కల్పించి ఔత్సాహితులను రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలన్నారు. క్యూఆర్ కోడ్, గ్రామ వార్డు సచివాలయ యాప్ ద్వారా రిజిస్టర్ కావాలన్నారు. ఎక్కువ మంది రిజిస్టర్ అయ్యే విధంగా జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సుమారు 10 లక్షల మందిని రిజిస్టర్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని ఇప్పటివరకు 4.5 లక్షల మంది నమోదయ్యారని మిగిలిన వారిని కూడా నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 31వ తేదీ పెన్షన్ పంపిణీ సమయంలో వారి కుటుంబ సభ్యుల్లో ఔత్సాహికులను రిజిస్టర్ చేయించాలన్నారు. 10 నుండి 18 సంవత్సరాల లోపు, 19 - 35 సంవత్సరాల మధ్య, 35 సంవత్సరాల పైబడిన వారికి యోగ పోటీలు నిర్వహించాలన్నారు. గ్రామ వార్డు స్థాయిలో పోటీలు ముగింపు దశకు వచ్చాయని, మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7 వరకు జిల్లా స్థాయిలో 9 నుండి 14 వరకు పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలను నిర్ణయించి డేటా ఎంట్రీ చేయాలన్నారు. జూన్ 6వ తేదీన నెల్లూరులో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం రెసిడెన్షియల్ అసోసియేషన్ థీమ్ తో జరుగుతుందని దానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

❖ జిల్లా మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు గ్రామ వార్డు స్థాయిలో ట్రైనీలను మ్యాపింగ్ చేయాలన్నారు. డి ఎస్ డి ఓ, జిల్లా పరిషత్ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు యోగా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్చార్జి కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ, పారిశుధ్యం, పౌర సరఫరాలు పీపుల్స్ పర్సెప్షన్ పై సమీక్ష చేశారు.

## శక్తి యాప్ ఆవశ్యకత గురించి విస్తృత అవగాహన



**నెల్లూరు క్రైమ్, మే 30, ప్రభాతవార్త:** మహిళల రక్షణకవచం శక్తి యాప్ అని, ప్రతి మహిళ ఫోన్లో శక్తి యాప్ ఉండాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు శక్తీ బృందాలచే జిల్లా వ్యాప్తంగా బస్టాండ్, రైల్వే స్టేషన్స్, ఇతర ప్రదేశాలలో విస్తృతంగా ప్రజలకు, మహిళలకు, విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మహిళల రక్షణ కవచం శక్తి యాప్ అని, ప్రతి ఒక్క మహిళ, గృహిణులు, విద్యార్థినిలు, బాలికలు మొబైల్లో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణపు సహాయం పొందాలని తెలిపారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకునే విధానం, దాని ఉపయోగాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరీ వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, ఫోక్సో యాక్ట్, చట్టాలు, మాదకద్రవ్యాల నిషేధం, డయల్ 100, 112, 1098, 1930, ఈగల్ సెల్ 1972 తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## ప్రత్యేక బృందం చే వేయింగ్, ఈపాస్ మిషన్లు పరిశీలన



**బిట్రగుంట, మే 30, ప్రభాతవార్త :** బోగోలు మండలంలోని రేషన్ దుకాణాలకు సంబంధించి వేయింగ్, ఈ పాస్ మిషన్లను ప్రత్యేక తూనికల, కొలతల అధికారులు, సాంకేతిక బృందం పరిశీలన చేశారు. బోగోలు బజారు మార్కెట్ సెంటర్ నందు శుక్రవారం ఈ పరిశీలన చేపట్టారు. జూన్ ఒకటవ తేది నుండి రేషన్ దుకాణాలలో నిత్యావసర వస్తువులు లబ్ధిదారులకు అందిస్తున్న నేపథ్యంలో మిషన్లు సరిఅయిన స్థితిలో ఉన్నాయో లేదో అని వీటి పరిశీలన జరిగింది అని బృందం అధికారి ఒకరు తెలిపారు. పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యం తో ఈ వివరాలు ఆన్లైన్లో పొందుపరచడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘము నేతలు జనపాల. సురేష్ రెడ్డి, అమిరిశెట్టి పార్థసారథి, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజమాత రాణి అహల్య బాయ్ హోల్కర్ జయంతి ఉత్సవాలు



**ఉదయగిరి, మే 30, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి శివాలయం ప్రాంగణంలో రాజమాత రాణి అహల్య బాయి హోల్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగేయి. రాణి అహల్య బాయి మురాఠి ఏదురాలు మొగలులు దురాక్రమణ నుంచి ఎన్నో ఆలయాలను రక్షించి పునర్నిర్మాణం చేసినారు ఎన్నో హిందూ ధర్మం కోసం ఎన్నో సంఘసంస్కరణలు చేసినారు గొప్ప పోరాట యోధురాలు ఈ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సిపారెడ్డి, వంశీధర్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు కార్తీక్, జనరల్ సెక్రటరీ శ్రీహరి, ఉపాధ్యాయుడు సూర్య రెడ్డి, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, విశ్వహిందూ పరిషత్ విప్లకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఏం కావాలో అదే చేద్దాం

- నెల్లూరు నగర పాలక అధికారులతో మంత్రి సమీక్ష
- ప్రస్తుత సీజన్‌ను బట్టి తగిన ఏర్పాట్లు చేయాలని సూచనలు
- అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు, మే30, ప్రభాతవార్త– వైద్యం** తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న అధికారుల పనితీరుకు నిదర్శనంగా నెల్లూరు నగరాన్ని అన్ని విధాల సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఓ ప్రణాళిక ప్రకారం వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరులోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో నగర పాలక సంస్థ అధికారులతో మంత్రి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు, ఎంత వరకు పనులు జరుగుతున్నాయి, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రజల అభిష్టానికి అనుగుణంగా ఇంకా చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాలు కుర్తుండటంతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు కాలువల్లో ఎక్కడ నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. పలు చోట్ల వర్షపు నీరు నిలిస్తే నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇంకా పలు విషయాలపై మంత్రి నారాయణ నెల్లూరు నగర పాలక అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజల ఆశలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే తన లక్ష్యమని మంత్రి నారాయణ ఘంటాపథంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తో పాటు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సుజల సరక్ష మంచినీటి ప్లాంట్‌లకు

### ప్రారంభోత్సవం : పాల్గొన్న మంత్రి నారాయణ



**నెల్లూరు, మే30, ప్రభాతవార్త– వైద్యం** భగత్ సింగ్ కాలనీ, జనార్ధన్ రెడ్డి కాలనీ, అంబేద్కర్ నగర్‌లో ఎన్టీఆర్ సుజల సురక్ష మంచినీటి ప్లాంట్‌లను మంత్రి నారాయణ శుక్రవారం ప్రారంభించారు. ప్లాంట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2లకే 20 లీటర్లు అందించిన మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంద ర్భంగా మంత్రి నారాయణ మాట్లా డు ూ రూ.2లకే 20 లీటర్ల నీటిని అందించడం ఆనందంగా ఉందన్నారు. పేదల కోసం 2018లోనే ఎన్టీఆర్ సుజల స్రవంతికిశ్రీకారం చుట్టామన్నారు. 6 కోట్లతో 6 లక్షల లీటర్ల నీటిని అందించాలనుకున్నామ న్నారు. సంగం ప్రాజెక్టు నుంచి నీటిని తెచ్చే స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. మాపై కోపంతో జగన్ ప్రభుత్వం పథకాన్ని ఆపేసిందన్నారు. అజ్ఞానంగా వ్యవహరించి కోట్ల రూపాయల ప్రజా సొమ్మును వృధా చేసిందన్నారు. నెల్లూరు సిటీలో మంచినీటి సమస్యను విస్మరించిందన్నారు. 3 మదర్ ప్లాంట్లు, 60 డెస్పెంన్సింగ్ యూనిట్ల ఏర్పాటుకు తిరిగి అనుమతులు ఇచ్చామన్నారు. ఇప్పటికే రెండు మదర్ ప్లాంట్స్ ప్రారంభించామన్నారు. మరో మదర్ ప్లాంట్ జూన్ లోపు ప్రారంభిస్తామన్నారు. ఈ రోజు మూడు డిస్పెంన్సింగ్ యూనిట్‌లను ప్రారంభించామన్నారు. సిటీలో 3 లక్షల కుటుంబాలకు రూ.2లకే 20 లీటర్ల మంచినీటిని అందిస్తామన్నారు. రూరల్ వాసులకు కూడా 2రూపాయలకే 20 లీటర్ల మంచినీటిని అందిస్తామన్నారు. అవసరమైతే అదనపు ప్లాంట్‌లు మంజూరు చేయిస్తానన్నారు. 550 కోట్లతో సంగం బ్యారేజ్ నుంచి మంచినీటిని తేవాలని 2014లో సంకల్పించామన్నారు. 85శాతం పనులు కూడా పూర్తి చేశామన్నారు. ఆ పనులను కూడా మాపై కోపంతో గత పాలకులు ఆపేశారన్నారు. ఏడాదిలోపే మిగిలిన పనులు కూడా పూర్తి చేశామన్నారు. ఖజానా ఖాళీ అయినా అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. కొద్దిగా ఓపిక పడితే హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. నెల్లూరుని దోమలు లేని నగరం చేయాలన్నదే లక్ష్యమన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో వేగం పెంచామన్నారు. సిటీలో మిగిలి ఉన్న చిన్న, పెద్ద డ్రైన్ల పనులన్నీ 300 కోట్లతో ఏడాదిలో పూర్తి చేశామన్నారు. భగత్‌సింగ్ కాలనీ వాసులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానన్నారు. ఏళ్ళ తరబడి ఉన్న సమస్యను పరిష్కరించి సీఎం చేతుల మీదుగా ఇంటి పట్టాలు ఇప్పిస్తానన్నారు. గత ప్రభుత్వం మోసం చేస్తే మేము న్యాయం చేశామన్నారు. పార్కుల అభివృద్ధికి పాటు పడిన వారందరికి అభినందనలు తెలిపారు. నెల్లూరు నగరాన్ని అబివృద్ధిలో దేశానికే రోల్ మోడల్‌గా నిలబడతానన్నారు. పాల్గొన్న కార్పొరేషన్ కమీషనర్ నందన్, ప్రజారోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ మోహన్, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్ షఫియా బేగం, 54వ డివిజన్ క్లష్టర్ ఇన్‌చార్జ్ జహీర్, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కలయిక విజ్ఞానకేంద్రంలో సమ్మర్‌క్యాంప్ ముగింపు కార్యక్రమం

**కావలిరూరల్, మే30 ప్రభాతవార్త** కావలి రామ్మూర్తిపేటలోని షిరిడిసాయి మందిరం వద్దగల కలయిక విజ్ఞాన కేంద్రం నందు పాఠశాల విద్యార్థులు వేసవి సెలవుల్లో విజ్ఞానం, వినోదం పెంపొందించుకుంటూ సెలవులు సద్వినియోగం చేసుకుంటారనే ఉద్దేశంతో ఏప్రిల్ 24వ తేదీనుండి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమైన రోజునుండి విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాన్ని (సమ్మర్‌క్యాంప్) ప్రారంభించడం జరిగిందని నిర్వాహకులు ఇలీంద్రలావణ్య, జి.రాంప్రసాద్, అడ్వైజర్ సి.శారదలు శుక్రవారం తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమ్మర్ క్యాంపులో చిత్రలేఖనం, హింది మౌళికవ్యాపకరణం, పాటల శిక్షణ, ఇంగ్లీషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీషుతో శిక్షణ కార్యక్రమం జరపడం జరిగిందన్నారు. ఇండోర్‌గేమ్స్, డ్యాన్స్ నేర్పడం జరిగిందని తెలియచేశారు. వేసవి శిక్షణక్యాంపు నేడు ముగింపు సందర్భంగా సమ్మర్‌క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక విద్యార్థుల సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమానికి రావాల్సిందిగా కోరారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు తగు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారు స్పందనతెలియచేసి సూచనలు ఇచ్చి ముున్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు.

## నేడు పిడతాపోలూరుకు ఎమ్మెల్యే రాక

**ముత్తుకూరు, మే 30, ప్రభాతవార్త** సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిడతాపోలూరు పంచాయితీలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేయనున్నారు. అలాగే ముసులూరు వారిపాల్యెంలో కూడా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతారని మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున్ యాదవ్ తెలిపారు.

## కాకాణి కుటుంబ సభ్యులతో చర్చించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు రూరల్, మే 30, ప్రభా తవార్త** నెల్లూరు డైకస్ రోడ్‌లో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్ ఛార్జీ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి గారి పై పెట్టిన ఫాల్స్ కేసును న్యాయ స్థానాల ద్వారా ఏ విధంగా ఎదుర్కోవాలో గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజితతో చర్చించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులని పరామర్శించేందుకు రేపు జిల్లాకు విచ్చేస్తున్న విషయాన్ని తెలియజేశారు. అక్రమ అరెస్టును ఖండించేలా పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిపై ఈ విధంగా అక్రమ కేసు పెట్టి వేధించడం ఎన్నడూ చూడలేదని, ప్రజాస్వామ్యంలో ఎన్నడూ ఇలాంటి ఘ టనలు చోటు చేసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ఈ విధమైన సంస్కృతి మంచిది కాదని హెచ్చ రించారు. ఇలాగే ప్రతిపక్ష నేతల అరెస్టులు కొనసాగిస్తే రేపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ నేతలు ఒక్కరైనా బయట తిరగగలరా ఆలోచించుకోవాలన్నారు. ఈ అక్రమ కేసులను ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గట్టి పోరాటం చేస్తుందని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బెదిరేది లేదని, రాబోయే రోజుల్లో ప్రభుత్వం, అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల గట్టి పోరాటం చేస్తామన్నారు. కాకాణి గోవర్ధన్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పార్టీ పీఏసీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి జిల్లాకు విచ్చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కాకాణి పూజితకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ నాయకులు కార్యకర్తలను పేరుపేరునా పరిచయం చేశారు. కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్, వైసిపి నాయకులు మాజీ ఏయం సి చైర్మన్ కోటేశ్వర రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశిత్ రెడ్డి, 11డివిజన్ ఇంచార్జ్ మహేష్ యాదవ్,42 డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్, వైసిపి యువజన విభాగం నాయకులు కిషన్, వైసిపి నాయకులు కొండయ్య, అశోక్,పెంచలయ్య, పెంచల బాబు, వెంకటేష్, సుమధర్,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఈ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్

### ఊటుకూరు నాగార్జున



**నెల్లూరు రూరల్, మే 30, ప్రభాతవార్త** నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వైయస్ఆర్సీపీ నేతలపై వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా నలుపు వస్త్రాలు ధరించి చేతికి నల్ల వస్త్రాలను సంకెళ్లుగా వేసుకుని ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనయిస్తుండడం, దుర్మార్గమని చాటారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికొదిలేసి, ప్రతిపక్ష పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తూ పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. నెల్లూరు జిల్లాలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై పెట్టిన అక్రమ కేసు అందుకు నిదర్శనమేనన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలనువారి ఆకృత్యాలను, ప్రజలకు తెలియజేసినందుకే గోవర్ధన్ రెడ్డి పై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని మండిపడ్డారు. జైల్లో పెట్టడంతో కూటమి నేతలు ఏదో ఘన కార్యం చేసినట్లు జబ్బలు చేరుచుకుంటున్నారని అన్నారు. జిల్లాలోనే కాదు యావత్ ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు.. ప్రతిపక్ష పార్టీ నేతలపై వారు పెడుతున్న అక్రమ కేసులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నెల్లూరు జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందించారని తెలిపారు. ప్రజలు వారి తీరును అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఈరోజు అక్రమ కేసులు పెడుతూ వైఎస్సార్సీపీ నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి సంకెళ్ల వేయడమేనన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వ అక్రమ అరెస్టులకు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి యువజన విభాగం నాయకులు చీదెళ్ల కిషన్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, వైసిపి నాయకులు వెంకటేష్, మీరా, కిషోర్, మస్తాన్, దీపు, మనోజ్, సుమధర్, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాకాణి పూజితతో బట్టేపాటి నరేంద్రరెడ్డి మర్యాదపూర్వక భేటీ



**ఇందుకూరుపేట, మే30, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని బైకాస్ రోడ్డు నివా సంలో కాకాణి పూజితతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన శాసనమండలి సభ్యులు, నెల్లూరు నగర వైసీపీ ఇన్‌ఛార్జీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టే పాటి నరేంద్రరెడ్డి ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ ఆమెకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైసీపీ సీనియర్ నాయకులు షేక్ షబ్బీర్ కోరుటూరు గ్రామ సర్పంచ్ పామంజి శ్రీనివాసులు, వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశ నుంచి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి



**లేగుంటపాడు(కోవూరు,) మే 30ప్రభాతవార్త** :కిశోర బాలికలు ప్రాథమిక దశ నుంచే డబ్బును పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. కోవూ రు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇనమడుగు సెక్టార్, లేగుంటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భా గంగా డబ్బులు ఏ విధంగా పొదుపు చేయాలని కిశోర బాలికలకు అవగాహన కల్పించారు.ఆమె మాట్లాడుతూ డబ్బును పొదుపు చేయడమే కాకుండా వృథాగా డబ్బు ఖర్చు చేయడం తగ్గించుకోవాల న్నారు. వీవోపీ ఎస్కే కరిష్మా మాట్లాడుతూ కిశోర బాలికలు పిగ్గీ బ్యాంక్ లేదా హుండీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వారానికి కొంత డబ్బును పొదుపు చేయడం ప్రారంభిస్తే ఆ డబ్బు వారికి అవసరమైనప్పుడు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## దాతలు ఆదుకోవాలని ఆ కుటుంబం ఎదురుచూస్తుంది

**ఉదయగిరి, మే 30, ప్రభాతవార్త** ఉదయగిరి మండలానికి చెం దిన టీడీపీ కార్యకర్త ఎన్జీవో అధ్యక్షులు పస్స్ రమణయ్య కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి వెలు తూ ప్రమాదవశాత్తు కారు యాక్సిడెంట్ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కడప ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించిన వై ద్యులు అతని ఊపిరితిత్తులలో రక్తం గడ్డ కట్టడం జరిగిందని మెడ భాగాన నరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఊపిరితిత్తులలో గడ్డ కట్టిన రక్తాన్ని ఆపరేషన్ ద్వారా తొలగించిన వైద్యులు మెడ భాగాన ఉన్న నరాలు దెబ్బతినడంతో పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఖర్చుతో కూడిన వైద్యం వలన అతని ఆరోగ్యం మెరుగవడానికి ఆయన కుటుంబం దాతలు కొరకు ఎదురు చూస్తుంది. ప్రస్తుత పరిస్థితి విషమంగానే ఉందని డాక్టర్లు తెలపడంతో ఆయనకు మెరుగైన వైద్యం అందించడానికి ఖర్చు పెట్టుకునే స్తోమత లేక ప్రస్తుతం ఆయన కుటుంబం దయనీయ స్థితిలో ఉంది. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ నాయకులు తమ మీద దయ చూపి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి

### జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ పరిమళ



**కోవూరు, మే 30ప్రభాతవార్త** : సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేలా వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ పరిమళ అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె వార్డు దగ్గరకు వెళ్లి రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వైద్యులు అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయి.. మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వారిని పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది ఎవరికి కేటాయించిన విధులు, బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటిస్తూ సకాలంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సేవలు అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమన్వయంతో ప్రభుత్వం ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తూ ఈ కేంద్రానికి మరింత పేరు తెచ్చేలా వైద్యులు దృష్టి పెట్టాలన్నారు.ఈ పరిశీలనలో ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లీలావతి, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ సలావుద్దీన్, డాక్టర్ మైనుద్దీన్, హెడ్ నర్సు ప్రసూనలత, ఫార్మాసిస్ట్ నరసింహులు, ల్యాబ్ అసిస్టెంట్ కిషోర్, తదితరులు ఉన్నారు.

## సామాజిక సేవలో పడుగుపాడు సహకార పరపతి సంఘం

### జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప



**కోవూరు, మే 30ప్రభాతవార్త** : సహకార పరపతి సంఘం అంటే కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం ధాన్యం కొనుగోలు చేయడం వంటి కార్యక్రమాలే కాకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ జిల్లాలో పడుగుపాడు సహకార పరపతి సంఘం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఇటీవల నిర్వహించిన మెగా వైద్య కంటి శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అటువంటి వారిలో ఎంపిక చేసిన వారికి సొసైటీ సహకారంతో కంటి అద్దాలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం, మెగా వైద్య శిబిరం ఏర్పాటు సొసైటీ ఆధ్వర్యంలో చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇనమడుగు గ్రామంలో సొసైటీకి సంబంధించిన స్థలంలో పెట్రోల్ బంక్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఇనమడుగు గ్రామంలో సొసైటీకి సంబంధించిన స్థలంలో వరల్డ్ లార్జెస్ట్ ప్రొక్యూర్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంఘంలో పెట్టుబడులు పెట్టేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సొసైటీ పర్యవేక్షణలో ఎల్‌పీజీ గ్యాస్ సంస్థ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి డీఆర్ తిరుపాల్‌రెడ్డి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె. సుబ్రహ్మణ్యం, సొసైటీ సీఈవో కె. గోవర్ధన్‌రెడ్డిసొసైటీ ఉద్యోగులు, రైతులు ఉన్నారు.

## 4న విద్రోహ దినం నిరసన ర్యాలీని జయప్రదం చేయండి



**రాపూరు,మే 30 ప్రభాతవార్త** అధికార తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయనందుకు నిరసనగా జూన్ 4వ తేది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్రోహదినంగా రాపూరులో వెంకటగిరి నియోజకవర్గంలోని అరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు రాపూరు మండల వైసిపి కన్వీనర్ బోద్దు మధుసూధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాపూరులోని పిచ్చిరెడ్డి కాంప్లెక్స్‌లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు,కలువాయి మండలాలకు చెందిన వైసిపి నాయకులు,కార్యకర్తలతో ఈ ఆందోళనా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అరుమండలాల వైసిపి నాయ కులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, యంపీటీసిలు, పెద్ద ఎత్తున పాల్గోని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.వైసిపి నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, దందోలునారాయణరెడ్డి, వంకివోలు కోటేశ్వరరెడ్డి,వెంకటగిరి నియోజకవర్గం డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఖాధర్ బాషా, నరసింహులు,డమ్మాయి రమణయ్య, మాదమాలపిచ్చిరెడ్డి, నరసింహులు, ఏటూరుమురళీమోహన్ రెడ్డి, బోద్దు అవినాష్ రెడ్డి, తదితరులున్నారు.

## రాపూరు వాసి దందోలు దిలీప్ కుమార్‌కు డాక్టరేట్



**రాపూరు,మే30ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు కాపువీధికి చెందిన దందోలు దిలీప్ కుమార్‌కు విక్రమ సింహపురి యునిర్సిటీ వారు డాక్టరేట్ ప్రధానం చేశారు. కావలి క్యాంపస్ కామర్స్ విభాగానికి చెందిన పరిశోధనా విద్యార్థి దందోలు దిలీప్ కుమార్ ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమల పనితీరు మూల్యాంకనం అనే అంశంపై విజయవంతంగా పరిశోధన్ చేశారు. ఈ పరి శోధనకు విశ్రాంత కామర్స్ విభాగ ఆధ్యాపకుడు డా.పి. వెంకట్రావు మార్గదర్శత్వం వహించారు. పరిశ్రమల సామర్థ్యం,వాటి వృద్ధిపై ప్రభావితం చేసే అంశాలు,సమస్యలు అవగాహనా రాహిత్యాలపై ఈయన చేసిన లోతైన ఆధ్యాయనం విశేష ప్రశంశలు పోందింది. డాక్టరేట్ పోందిన దిలీప్ కుమా ర్‌ను యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కావలి కళాశాల ప్రిన్స్‌పాల్ అచార్య సిహె చ్. శ్రీనివాస రావు, నెల్లూరు క్యాంపస్ ఆచార్య సిహెచ్ విజయ, పరిక్షల విభాగదిపతి డాక్టర్ మధుమతి, కామర్స్ విభాగాధిపతి సిహెచ్ శ్రీనివాసురావులు ప్రత్యేకంగా అభినందించారు. పరిశ్రమల అభివృద్ధికి దిలీప్ కుమార్ చేసిన పరిశోధన కీలక దిశగా మార్గనిర్దేశకంగా నిలుస్తుందంటూ వర్శిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

## పెనుశిల లక్ష్మీనృసింహుని అన్న ప్రసాదానికి రూ.1 లక్ష విరాళం



**పెంచలకోన(రాపూరు),మే30ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి వారి అన్న ప్రసాదానికి శుక్రవారం కడప జిల్లా, బద్వేల్ వాస్తవ్యులు గాజులపల్లి శంకర రావు, వారి ధర్మపత్ని శ్రీదేవిలు రూ. 1 లక్ష రూపాయిలు అన్న ప్రసాదానికి విరాళంగా ఆందజేశారు. కోనకు వచ్చిన వారు ముందుగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి, శ్రీ అధిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామి వార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డికి స్వామి వారి అన్న ప్రసాదానికి సంబందించి రూ.1లక్ష విరాళాన్ని ఆందజేశారు. స్వామి వారి అన్న ప్రసాదానికి విరాళం ఆందించిన దాతలకు ఉప కమీషనర్ స్వామి వారి చిత్రపతాన్ని, తీర్ధ ప్రసాదాలను ఆందజేశారు.

## కోత్తపేటలో రోడ్డులేక వర్షానికి చిత్తడైన రహదారి



**రాపూరు,మే30ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని కోత్తపేట రెండవ వీధికి రోడ్డు లేకపోవడంతో చిన్న వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి రోడ్డు చిత్తడిగా మారింది. గతంలో 4 సంవత్సరాల క్రితం ఈ రోడ్డు వేసేందుకు వున్న రోడ్డును తవ్వేశారు. కాని రోడ్డు మాత్రం వేయలేదు. దీంతో వున్న రోడ్డుపోయి, ప్రస్తుతం మట్టిరోడ్డు చిన్న వర్షానికే చిత్తడిగా మారి నడించేందుకు కూడా వీలు లేకుండా వుండటంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయితీ పాలకులు కాని జిల్లా అధికారులు కాని దీనిపై దృష్టి సారించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఈ వీదిలో వుంటున్న ప్రజలు కోరుతున్నారు.

## కండలేరులో 40.791 టీయంసీల నీటిమట్టం

**రాపూరు,మే30ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో శుక్రవారం ఉదయం నాటికి జలాశయంలో 40.791 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1860 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2040 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## కొత్తూరు గ్రామంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు జన్మదిన వేడుకలు



**ఇందుకూరుపేట, మే30, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర కూట సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీలేబూరు రాజేంద్ర రెడ్డి వర్మ జన్మదిన వేడుకలు అగ్నికుల క్షత్రియ వీరులు, వారి మిత్రబృందం చేతుల మీదుగా ఘనంగా జరి గాయి. ఈ కార్యక్రమంలో ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈ విధంగా తమ నమ్మిన వారి మధ్య వేడుకలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 1 కోటి జనాభా కలిగిన జాతి ఏదైనా ఉంది అంటే అది అగ్నికుల క్షత్రియలు మాత్రమే అన్నారు. సుమారు 4 యుగాలు పాటు సనాతన ధర్మాన్ని రక్షితు రాజ్య పాలన చేసిన జాతి ఏదన్నా ఉంది అంటే అగ్నికుల క్షత్రియ జాతి మాత్రమే అన్నారు. వీరిని దక్షిణ భారతదేశంలో అగ్నికుల క్షత్రియ, పల్లి పల్లిరెడ్డి, పల్లికాపు, వన్నిరెడ్డి, వన్ని కాపు, వన్ని కుల క్షత్రియ అని పేర్లతో పిలుస్తారు. ఉత్తరాన రాజపుత్రులుగా పిలుస్తారు అన్నారు. స్వతంత్ర రాక ముందు వరకు వీరి రాజ్యా లు ఉండేవని అన్నారు. వీరి రాజ వంశాలు అయినటువంటి చెర, చోళ, పాండ్య, పల్లవ, రాష్ట్ర కూట పేర్లు మరలా తెరపైకి తీసుకొస్తాం అని తెలియజేశారు. భువి పైన ఏకైక క్షత్రియ జాతి ఉంది అంటే అది అగ్నికుల క్షత్రియ మాత్రమే అన్నారు. స్వతంత్రం రాక ముందు లేని కొత్త కొత్త క్షత్రియ జాతులు ఈనాడు ఆంధ్ర రాష్ట్రంలో పుట్టుకొస్తున్నాయని విలపించారు. పృధ్విరాజ్ చౌహాన్, మహారాణా ప్రతాప్ వంటి రాజపుత్ర యోధులు అగ్నికుల క్షత్రియ జాతిలో జన్మించారని అన్నారు. వీరు సూర్య చంద్ర, అగ్ని వంశాల వారసులు అన్నారు. అగ్నికుల క్షత్రియ అంత ఐక్యంగా ఉండాలి అన్నారు. వారి ఏ కులాలు పైన ఈర్ష ద్వేషాలు లేవు అన్నారు. నాపై ఇంతటి ప్రేమ అభిమానం తెలిపిన అగ్ని క్షత్రియ వీరులకు, సాటి కుల మిత్రులకు సహోదరులకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## పదిలో ప్రతిభ చూపిన పల్లిపాడు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థినీ మేఘన



**ఇందుకూరుపేట, మే30, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం పల్లి పాడు గవర్నమెంట్ హైస్కూల్ చింతపంటి మేఘన అనే విద్యార్థికి 10వ తరగతి ఫలితాలలోమొదటిగా 559 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. గతంలో సోషల్ సబ్జెక్టులో 78 మార్కులు రాగా రీవాల్యుయేషన్లు 17 పెరిగి మొత్తం 95 మార్కులు సోషల్ సబ్జెక్టులో రాగా మొత్తం 576 మార్కులతో స్కూల్ ద్వితీయ స్థానం సాధించింది. ఆ బాలిక ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేయగా, గతంలో మార్కులకు తనకు సీటు రాదని అదే విధంగా ఇప్పుడు రివాల్యూయేషన్ అనంతరం తనకు ట్రిపుల్ ఐటీకి సీటు వచ్చే అవకాశం ఉందని, ఆమె తల్లిదండ్రులు స్కూల్ ఉపాధ్యాయులు తెలిపారు. ఈనెల 20లోపు ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోవాలని, ఈ పరిణామాల కారణంగా ఆ గడువు దాటిపోయిందని, విద్యార్థినీ తల్లిదండ్రులు వాపోయారు. ఇప్పుడు వచ్చిన మార్కులకు సీటు వచ్చే అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకునేందుకు చింతపంటి మేఘనకి ప్రత్యేక అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థిని తదండ్రి కూలి పనులు చేస్తూ కుమార్తెను చదివిస్తున్నారు.

## గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ :ఎమ్మెల్యే



**కందుకూరు, మే30, ప్రభాతవార్త** గుడ్లూరు మండల కేంద్రంలోని ప్రా థమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను సిబ్బంది హాజరు పట్టిని క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఆరోగ్య కేంద్రంలో వచ్చే రో గుల సంఖ్య వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో మందుల విభాగాన్ని పరిశీలించి రోగులకు ఇస్తున్న మందులు వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, సీజన్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన వైద్య సదుపాయలు అందించాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.

## రమాదేవి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కందుకూరు, మే 30, ప్రభాతవార్త** గుడ్లూరు మండలం చేవూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో నూతలపాటి వెంకటేశ్వర్లు భార్య రమాదేవి గురువారం మరణించారు. శుక్రవారం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు రమాదేవి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు పొట్టేళ్ల మురళి, కావలి ఏసుదాసు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సీడీపీఓ పొదుపుపై అవగాహన కార్యక్రమం



**ఉదయగిరి, మే30, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి సినిమా హాల్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక అంశాల నిర్వహణ పొదుపుపై సీడీపీఓ ఎస్.సునీత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు అవసరాలను బట్టి డబ్బులు ఆదా చేయడం ఖర్చు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వజర్ తేజస్విని, కార్యకర్త సుజాత, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## 4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి



**ఉదయగిరి, మే30, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్4న రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్ధానాన్ని హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలను మోసగించినందుకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

## 70శాతం హాజరు ఉన్నవారికి కుట్టుమిషన్లు పంపిణీ

ఉదయగిరి, మే30, ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. మహిళలు స్వయం శక్తి కోసం తోడ్పాటు అందిస్తున్నట్లు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ కోరారు. 70 శాతం హాజరు ఉన్న వారికి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ పంపిణీ చేస్తామని తెలిపారు. శిక్షణ 90 రోజులు ఉంటుందన్నారు. ఈ 90రోజులు అందరూ క్రమం తప్పకుండా వచ్చి శిక్షణ నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత సామరశ్యం,దేశా సమగ్రత పరిరక్షణ ధ్యేయం గా ఉండాలి



**బిట్రగుంట, మే 30, ప్రభాతవార్త :** కాశ్మీర్ లో ఉగ్రవాదుల దాడుల తరువాత మతపరంగా విభజన తేవడానికే ఈ దాడులు జరిగాయాని పేర్కొనడంతో ఉగ్రవాదాన్ని వదిలివేసి మతపరంగా కొన్ని శక్తులు మతోన్మాదన్నీ, ముస్లిం వ్యతిరేకతతో వక్రబుద్ధితో దేశాన్ని బలహీన పరుస్తున్నారని సిపిఎం సీనియర్ నేతలు పేర్కొన్నారు.మత సామరస్యం, దేశసమగ్రత పరిరక్షణ లో భాగంగా శుక్రవారం బోగోలు లో కరపత్రాలు పంపిణి చేసి పాదయాత్ర నిర్వహించారు.ఈ ఉగ్రవాదులదాడులలో పర్యాటకులను రక్షించింది ముస్లింలని, అయితే సోషల్ మీడియా లో ముస్లింల పైన చెడుగా ప్రచారం చేయడాన్ని వారు ఖండించారు.ఈ విషయం లోఅమెరికా జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. సమైక్యతస్పూర్తి తో కాశ్మీర్ సమస్య ను మూడవ దేశం జోక్యం లేకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కావలి డివిజన్ సీనియర్ నేతలు రావి. మాల్యాద్రి, గడ్డం. మాల్యాద్రి, తుమ్మల. వెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి చల్లా. నరహరి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయం నందు యోగాపై శిక్షణ



**కావలిరూరల్, మే30 ప్రభాతవార్త** కావలి మండలపరిషత్ కార్యాలయం నందు కావలి రూరల్ మండల పరిధిలోని పంచాయితి కార్యదర్శులకు, సచివాలయ పరిధిలోని సిబ్బందికి శుక్రవారం నెల్లూరు నందు శిక్షణ పొందిన యోగామాస్టర్స్ ట్రైనర్ల ద్వారా శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అది. కారణి చేవూరు శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. యోగాశిక్షణ పొందినవారు సచివాలయ పరిధిలోని గ్రామాలలో రిజిస్ట్రర్ అయిన వారికి యోగ నందు శిక్షణను ఇవ్వడం జరుగుతుందని తెలియచేశారు. ప్రతి ఒక్కరూ యోగాను వారి జీవితంలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యాన్ని స్వంతం చేసుకోవాలని సూచించారు. జూన్‌నెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్‌నెల 17వ తేదిన మండలస్థాయిలో నిర్వహించే యోగా కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాల్సిందిగా ఆమె కోరారు. యోగశిక్షణ పొందిన మాస్టర్స్ చంద్రిక, రేణుక, విజయభారతి, పాల్గొన్నారు.

## పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ



**కావలిరూరల్, మే30 ప్రభాతవార్త** కావలి జనతాపేట నివాసులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలైన ఎల్ఇఆర్ లీలావతి మనుమడు వర్షిత్‌ఖర్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలో ఉన్న నిరుపేదపిల్లలకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ద్వారా భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. తమయొక్క సంస్థ ద్వారా పేదపిల్లలకు వారి మనుమడు పుట్టినరోజు సందర్భంగా భోజనం ప్యాకెట్లు వితరణ చేయించిన లీలావతికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నామని తెలిపారు. వర్షిత్‌ఖర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు.

## ఆకస్మిక రేషన్ దుకాణం తనిఖీ చేసిన తహసిల్దార్



**కొడవలూరు, మే 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్న రెండవ నెంబర్ రేషన్ దుకాణాన్ని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే సరుకులు తప్పనిసరిగా ప్రజలకు అందచేయాలని సూచించారు. ప్రజలకు అందించే రేషన్ సరుకులు పక్కదారి పట్టించినట్టయితే పై అధికారులకు తెలిపి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కొత్త రకాల వరి పంటలపై అవగాహన : శాస్త్రవేత్తలు



**విడవలూరు, కొడవలూరు, మే 30, ప్రభాతవార్త :** వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నెల్లూ రు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్య ఎన్. జి. రంగా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలోవిడవలూరు,కొడవలూరు మండలాలు కమ్మ పాలెం, చౌకచర్ల గ్రామాలలో రైతులకు అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అనువైన పంట యొక్క సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ లోకేష్ బాబు మాట్లాడుతూ రైతులు చేసే కృషి ఎంతో గొప్పదన్నారు. యువతను వ్యవసాయం వైపు ఆకర్షించడానికి ఆర్య ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడింది అని తెలిపారు. అలాగే యువతకు స్వయం ఉపాధి కల్పించడంలో ఆర్య ప్రాజెక్ట్ చాలా ఉపయోగపడిందని తెలిపారు. అదేవిధంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక పథకాలు గురించి వివరించారు. అనంతరం నాగేశ్వర రావు మాట్లాడుతూ భూమిని ఎలా సమృద్ధిగా కాపాడుకోవాలో అలాగే భూసార పరీక్ష ఆధారంగా ఎరువులను వాడుకోవాలి తద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుంది ఆదాయం పొందడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, వ్యవసాయ అధికారులు శైలజ కుమారి, వెంకట కృష్ణయ్య, చౌక చర్ల రైతు నాయకుడు అశోక్ రెడ్డి,కమ్మ పాలెం సర్పంచ్ సిహెచ్ లక్ష్మి, ఎంపీటీసీ అరుణ, ఏఈఓ వెంకట్రావు, విఏఏలు సుజిత్, ప్రగతిశీల తదితరులు పాల్గొన్నారు.

## ఒక రోజు ముందే పెన్షన్లు పంపిణీ



**లింగసముద్రం, మే30, ప్రభాతవార్త** మండలంలోని అన్ని గ్రామాల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 31వ తేదీ అనగా శనివారం రోజున పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. జూన్1వ తేదీన ఆదివారం కావడం పట్ల ఈనెల ఒక రోజు ముందస్తుగానే పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుంది. మండలంలోని 5,198 మంది గాను 22459 500 రూపాయల నగదు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అందువలన వృద్ధాప్య పింఛన్‌దారులు, వితంతు పింఛన్ దారులు, వికలాంగులు, ఇతర పింఛన్‌లు తీసుకునే అందరూ మీ ఇళ్ల దగ్గర ఉండి పింఛన్లు తీసుకోవాల్సిందిగా కోరారు. పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది మీ ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తారు, కావున అందరూ అందుబాటులో ఉండాల్సిందిగా కోరారు.

## టీడీపీ నేత మల్లిఖార్జున మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి నారాయణ



**నెల్లూరు,మే 30,ప్రభాతవార్త- వైద్యం** నెల్లూరు నగరంలోని 14వ డివిజన్ బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్న మహిళా కార్యకర్త దొడ్డపనేని సుగుణమ్మ భర్త మల్లిఖార్జున అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారా యణ ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులను పరా మర్శించారు. టీడీపీ పార్టీ నమ్ముకున్న వారికి ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## లాంగ్ లీవ్ లాంగ్ లీవ్ 'సీఐటీయు' లాంగ్ లీవ్



**- కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. ఐక్య పోరాటాలు వర్ధిల్లాలి**

**తోటపల్లిగూడూరు, మే 30, ప్రభాతవార్త** తోటపల్లిగూడూరు మండలం సీఐటీయు మండల కార్యదర్శి మారుబోయిన రాజా సీఐటీయు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులను ఉద్దేశించి రాజా మాట్లాడుతూ విశాల భారత కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే లక్ష్యంతో ఐక్యత పోరాటం నినాదంతో 1970మే 30వతేదీన సీఐటీయు(సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ఆవిర్భవించింది. నాటి నుండి నేటి వరకు అన్ని రంగాలకు సీఐటీయు విస్తరించింది. కార్మికుల హక్కుల కోసం పోరాడుతూనే ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యలు, సామాజిక పోరాటాలకు మద్దతు ఇస్తూ ముందుకు సాగుతుంది సీఐటీయు. తోటపల్లిగూడూరు మండలంలో వాటర్ బేస్ రొయ్యల ఫ్యాక్టరీలో అమ్మోని గ్యాస్ లీక్ అయిన సందర్భంగా యాజమాన్యాన్ని ప్రశ్నించింది. కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని వారికి అండగా ఉంటామని చెప్పింది. సీఐటీయు అని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనాఉందని, అంతే కాకుండా అంగన్‌వాడీ వర్కర్స్ న్యాయమైన డిమాండ్స్ సాధన కొరకు సుదీర్ఘ 42 రోజుల పోరాటంలో ఆశావర్కర్స్ జీతాలు పెంపు పోరాటాలలో మధ్యాహ్న భోజ న కార్మికుల మెనూ ఛార్జీలు పెంచాలని నినాదంతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి దారి మళ్ళిన నిధిని వారికే కేటాయించాలని, ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఇలా అనేక పోరా టాలలో సీఐటీయు మండలంలో ముందున్నదని, రానున్న కాలంలో కార్మిక చట్టాలను, హక్కులను కాపాడు కునేందుకు కార్మిక వర్గం ఐక్యమై పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలకై రిజిస్ట్రేషన్ చేసుకోండి

జలదంకి,మే30,ప్రభాతవార్తః రైతాంగం పచ్చిరొట్ట విత్తనాలకై ఆయా గ్రామాల రైతు సేవాకేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాదికారిణి శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ జేశారు.జనుము,జీలగ,పిల్లిపెసర్లు 50శాతం సబ్సిడితో అందింస్తున్నామని విత్తనాలు కావలసిన రైతులు ముదటగ రిజిస్ట్రేషన్ చేయాల్సి వుంటుందని చెప్పారు.జీలగలు కెజి ధర123రూపాయలు కాగ సబ్సిడికింద 61.50 రూపాలకు పొందవచ్చున్నారు.జనుములు 109రూపాయలు కాగ 54.50 రూపా యలకు,పిల్లిపెసర్లు 180రూపాయలు కాగ సబ్సిడిపై 90రూపాయలకు అందిస్తున్నామని వ్యవసాయాదికారిణి వివరించారు .కావున అన్నదాతలు ఈఅవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

## అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు



**ఉదయగిరి, మే30, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని రైతు సేవా కేంద్రాలలో పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ తెలిపారు. 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకొని నగదు చెల్లించిన రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. కావున రైతులు విత్తనాలు తీసుకొని వెళ్లాలని ఆయన కోరారు. ఒక కేజీ జీలుగ విత్తనాల పూర్తి ధర రూ.123, కేజీ జనుము విత్తనాలు రూ.109, కేజీ పిల్లి పెసర విత్తనాలు రూ.180లు, కాగా 50 శాతం సబ్సిడీ పోనూ 10 కేజీల జీలుగుల సంచి రూ.615, 10 కేజీల జనుము సంచి రూ.545, 8 కేజీల పిల్లి పెసర విత్తనాలు రూ.720కి పొందుటకు రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని రైతులు పొందాలన్నారు.

## బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం



**ఉదయగిరి, మే30, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి బాలాజీ నగర్‌లో గల బీజేపీ కార్యాలయం నందు శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆవుల రోశయ్య యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయగిరి బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. కృష్ణాపురం నీటి సంఘం అధ్యక్షులు భేరి విష్ణువర్ధన్‌రెడ్డికి శాలువా పూలమాలతో ఘనంగా సత్కారం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు.

## సంఘ సభ్యులను లక్షాధికారులను చేయడమే లక్ష్యం



**వింజమూరు, మే30, ప్రభాతవార్త** వెలుగు పథకంలో ఉన్న సంఘ సభ్యులను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తుందని ఏపీఎం బి.సుధాకరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏలు సమాఖ్య అధ్యక్షురాలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్ఎల్‌బీ సర్వే ద్వారా సంవత్సరానికి ఏ సభ్యురాలికి ఎంత అవసరమో గుర్తించి ఆ అవసరాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా కానీ లేదా ఉన్నతి ద్వారా కానీ స్త్రీనిధి లేదా సీఏఎఫ్, అంతర్గత నిధుల నుంచి సభ్యురాలు వారీగా ఎస్సీపీని తయారు చేస్తామని తెలిపారు. ఆ ప్రణాళిక ప్రకారం సభ్యురాలు అవసరమైన రుణాన్ని అందించి తమ జీవన ఉపాధిని పెంపొందింపచేసి లక్షాధికారి అయ్యేలా చేయడమే లక్ష్యంగా ఉంద న్నారు. ప్రస్తుత సంవత్సరానికి 679 గ్రూపులను లక్ష్యంగా చేసుకొని సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే 180 గ్రూపులను సర్వే పూర్తి చేశామన్నారు. రుణం అవసరమైన సభ్యురాళ్ల పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి బ్యాంకులకు పంపుతామన్నారు. వివరాలన్నీ కూడా పారదర్శకంగా ఉండేలా చేస్తామన్నారు. పొదుపు ద్వారా సేకరించిన సొమ్ము బ్యాంకులనుండి తీసుకుని ఏ విధంగా ఉపయోగించుకోవాలో దాని విధివిధానాలపై ఒక ప్రణాళికను తయారు చేస్తున్నట్లు ఆయనతెలిపారు.మండల సమాఖ్య నూతనకమిటీని ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. సీసీలు సుశీల, సునీత, లక్ష్మీ కుమారి, విజయమ్మ, సిబ్బంది, ఆపరేటర్ సువార్త తదితులు ఉన్నారు.

## యోగాసనాలతో ఆరోగ్యం



**వింజమూరు, మే 30, ప్రభాతవార్త** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఆ ర్‌డీపీ వెలుగు మండల స్థాయి సిబ్బం దితో యోగాసనాలు వేయించారు. ఎంపీడీఓ కే.శ్రీనివాస్‌రెడ్డి ఏపీఎం బి.సుధాకరరావుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భం గా వారు మాట్లాడుతూ యోగా శరీరా నికి ఎంతో ఉపయోగకరమని మానసిక ప్రశాంతతకు మానసిక ఆనం దానికి మూలమన్నారు. యోగాసనాలలో అనేక రకాలు ఉన్నాయని వాటిలో ప్రాణాయామము ముఖ్యమైం దని ఆ ఆసనాన్ని అలవాటు చేసుకున్నట్లయితే శారీరక రుగ్మతలు తొలగిపోతాయన్నారు. అంతే కాకుండా మనిషి ధాన్యం కానీ సూర్యనమస్కారాలు గాని చేసినట్లయితే మనసు ఉత్తేజితమై ప్రకాశవంతంగా ఉంటుం దన్నారు. చేసే పనిపై ఒత్తిడిని లేకుండా చేసి చేయాలన్నటువంటి ఆసక్తిని కలిగిస్తుందన్నారు. అప్పుడే సక్రమంగా మనం చేసే పని చేయగలుగుతామని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ యోగాసనాలను అలవాటు చేసుకుని తన జీవితంలో ఆనందమయంగా గడపాలన్నారు. వెలుగు సిబ్బంది, సంఘ సభ్యులు ఉన్నారు.

## ఇరు వర్గాల ఘర్షణ ఇద్దరికి రక్త గాయాలు





**వింజమూరు, మే 30, ప్రభాతవార్త** వింజమూరులోని వినాయకబొమ్మల తయారీ దారులకు, పందుల పెంపకం దారులకు మధ్య ఘర్షణ స్థానిక లారీ కాటా సమీపంలో జరిగింది. వినాయక బొమ్మల తయారీదారులు తన బొ మ్మల తయారీ స్థానం నుండి మూడు చక్రాల ఆటోలో వస్తూ ఉండగా కాటా సమీపానికి రాగానే పందుల పెంపకం దారులు తమ జీవాలను లారీ ఎక్కిం చేందుకై అక్కడ నిలబడి ఉండగా మూడు చక్రాల ఆటో వారిని తగల బోయిందని ఎందుకు పైకి వస్తున్నావు అని అడగ్గా మిమ్మల్ని తగల్లేదు ఎం దుకు అరుస్తున్నారని మాట్లాడుకుంటూ మాట పెంచుకొని ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో బొమ్మలు తయారు చేసే సురేష్ రమేష్ అనువారలకు తలపై రక్త గాయాలయ్యాయి. వెంటనే వారు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. వైద్యాధికారి మధుమోహన్‌రెడ్డి పరీక్షించి గాయాలకు చికిత్స చేశారు. రమేష్ సురేషన అనువారలకు రక్త గాయాలైనట్లు కుట్లు వేయబడ్డాయని తెలిపారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి అన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ జయరాజ్ స్థానిక సీహెచ్‌సీ వెళ్లి బాధితుల నుండి ఫిర్యాదు స్వీకరించారు.

## ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**వింజమూరు, మే30, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం వృద్దులకు వికలాంగులు వితంతువుల సంక్షేమం కోసం ప్రతి నెల ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రస్తుతం ఒక రోజు ముందుగానే 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారమే పంపిణీ చేస్తున్నారు. మండలంలో 5508 మంది పింఛన్ దారులకు సంబంధించి రెండు పాయింట్ నాలుగు మూడు కోట్ల రూపాయలను వృద్దులకు వికలాంగులకు వితంతువులకు 14 మంది సచివాలయ సిబ్బంది చేత పంపిణీ చేయిస్తున్నట్లు ఆయనతెలిపారు.శనివారం తీసుకోలేకపోయిన వారికి మరుసటిరోజు అందజేస్తారని తెలిపారు. కావున లబ్దిదారులు గమనించి తమ పింఛన్ అందుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## ప్రముఖ చిత్రకారుడు సుదర్శన్‌కు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘన సత్కారం



**ఉదయగిరి, మే30, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంస్కార భారతి చిత్ర లేఖన శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శిక్షణ తీసుకున్న పిల్లలకు ప్రశంస పత్రం షీల్డ్ అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిఇ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అగ్రికల్చర్ కాలేజీ ఏడీ కృష్ణారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ బాలకేశవులు చిత్రలేఖన గురు వు సుదర్శన్‌ని ఘనంగా సన్మానించడం జరిగింది. సన్మానం ఉదయగిరి బీజేపీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి మండల పార్టీ ఉపాధ్యక్షుడు కార్తీక్ విశ్వ హిందుపరిషత్ విప్లవ కుమార్‌రెడ్డి, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భూముల సమస్యలు సత్వారమే పరిష్కరించాలి



బిట్రగుంట మే 30 ప్రభాతవార్తః మండలంలోని భూముల వివాదలను సత్వారమే పరిష్కరించాలని కావలి ఆర్ డి ఓ వంశీకృష్ణ ఆదేశించారు. బోగోలు మండల పరిషత్ కార్యాలయం లో శుక్రవారం ప్రజా విజ్ఞప్తుల ప్రత్యేక పరిస్కారవేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అర్జీని నిశితంగా పరిశీలన చేసి నిర్నీత వ్యవధిలో వాటికీ పరిస్కారం చూపాలన్నారు.ఆర్ డి ఓ పలు అర్జీలు స్వీకరించి తహసీల్దార్ సురేష్ కుమార్‌కు ఆదేశాలు జారిచేసారు. సత్వరమే పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచనలు చేశారు.

## రేషన్ షాపులు తనిఖీచేసిన తహసీల్దార్



**జలదంకి,మే30,ప్రభాతవార్తః**జూన్ 1నుంచి రేషన్ షాపులద్వార సరకులు అందించనున్న నేపద్యంలో జలదంకి తహసీల్దార్ ప్రమీల శుక్రవారం మండలంలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు .ఎండిఎం వాహనాల రద్దు అనంతరం చౌకదుకాణాల డీలర్లుకు ఈబాధ్యతలు అప్పజెప్పారు.నూతన పాలసి అమలు పకడ్బందిగ చేపట్టే క్రమంలో తహసీల్దార్ దీనిపై డీలర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.దుకాణాలలో ఈపాస్,ఎయింగ్ మిషన్ల కండిషన్ వంటివాటిని క్షుణ్ణంగ పరిశీలించారు.అలాగే వికలాంగులు,వృద్దులకు 1నుంచి ఐదురోజులపాటు వారివారి నివాసాలకువెళ్ళి సరకులు పంపిణి చేయాలని ఆదేశించారు.ఇందులో ఎక్కడైన ఎవరైన అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిందిం.కావున నిభందనలు ఖచ్చితంగ అమలుచేయాలని డీలర్లకు తెలిపజేశారు.ప్రభుత్వం ప్రజలకు అందించే చౌకబియ్యం పదకం అక్రమాలకు తావులేకుండ సజావుగ సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వివరించా రు.ఈకార్యక్రమంలో ఆమె వెంట సీనియర్ అసిస్టెంట్ శ్రీజ,ఆయా పంచాయతీల విఆర్ఒలు వున్నారు.

## ఉదయగిరి పోలీసు స్టేషన్ ముందు విషం తాగిన యువతి



**ఉదయగిరి, మే30, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని వడ్డిపాలెంలో ఓ యువతి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం రాత్రి కలకలం సృష్టించింది. అదే గ్రామానికి చెందిన యువకుడితో నెల్లూరులో ఆమె కలిసి ఉంటుంది అని సమాచారం ఈ క్రమంలో అతను మరో అమ్మాయితో పెళ్లికి సిద్దమయ్యాడని యువతి మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఉదయగిరి పోలీసు స్టేషన్ వద్ద సదరు యువతీ విషం తాగింది. ఈ విషయాన్ని పోలీసులు వెంటనే గమనించి ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే



**కావలి, మే30 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం కావలి పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. కావలి చర్చిరోడ్డు రెండవవీధి కచ్చేరి మిట్టకు చెందిన రెవ.డాక్టర్ ఆకుల యేసుబాబు సతీమణి ఆకుల సువార్తమ్మ ప్రథమ జ్ఞాపకార్థస్తుతికూడిక వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

**సాయిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే :** ముసునూరుకు చెందిన మర్లపాటి శ్రీను, రాజేశ్వరి దంపతుల కుమారుడు సాయి వివాహం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.

**వీరరాఘువిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే** కావలిపట్టణం 32వ వార్డుకు చెందిన పల్లపు ప్రసాద్ కుమార్తె వీరరాఘవి ఓణీల మహోత్సవ కార్యక్రమం కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్‌రెడ్డి కళ్యాణమండపం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారి వీరరాఘవిని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరినాయుడు, టిడిపి నాయకులు నాయుడురాంప్రసాద్, తిరివీధి ప్రసాద్, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



**కందుకూరు, మే30, ప్రభాతవార్త** ప్రభుత్వం పొగాకు రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం పామూరు రోడ్డులోని 27వ నెంబర్ పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి ధరలపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో కిలో పొగాకు ప్రారంభం 230 నుంచి రూ.300 వరకు ఉండేదని, ప్రస్తుతం 280 నుంచి రాను రాను ధర తగ్గిపోతుందని తెలిపారు. గత ఏడాది లోగో రెడ్డి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారని ప్రస్తుతం లో గ్రేడ్ కొనుగోలు చేయకపోవడంతో బోర్డుకు తెచ్చి తిరిగి వెనక్కి తీసుకెళ్తున్నామని రైతులు ఎమ్మెల్యే తో తెలిపారు. రైతులు సమస్యలు విన్న ఎమ్మెల్యే కొనుగోలుదారులైన కంపెనీ ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయరన్న భయం రైతులతో ఉందని పర్సంటేజీలు పెంచి అన్ని రకాలుగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే రైతులు, బయ్యర్లు, బోర్డు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పొగాకు కొనుగోలుకు కృషి చేయాలని కోరారు. రైతులు బాగుంటేనే కంపెనీలు, కంపెనీలు బాగుంటేనే మీరు ఇలా ఒకరికి ఒకరు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి ఆకు వరకు రైతులు పండించిన పొగాకు పంటను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, రైతులెవరు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. ఎవరో వచ్చి చెప్పే మాయ మాలు రైతులు నమ్మవద్దని కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వేలేటి నరసింహం, రమణయ్య, వడ్లమూడి రామకృష్ణ, అత్తంటి శ్రీహరి నాయుడు, బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



**కోవూరు, మే 30ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రూపులు క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఆదాయ పరిమితిని మరింత పెంపుదల చేసేలా దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్‌జీబీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పొదుపు గ్రూపుల్లో మరింత అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు సభ్యులకు లక్ష రూపాయల మేర స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నామన్నారు. వీటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదేవిధంగా పొదుపు గ్రూపు సభ్యులు వారి వారి ఇంటి స్థలాల్లో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. మొబైల్ బుక్ కీపింగ్ 2.0లో ఎప్పటికప్పుడు తమ సంఘానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచుకోవాలన్నారు. అదేవిధంగా కార్మిక శాఖకు సంబంధించి ఈ శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళలు కూడా నమోదు చేసుకోవాలన్నారు. సీసీలు రాజశేఖర్, చైతన్య, రాము, శోభ, తదితరులు ఉన్నారు.

## జూన్ 1 నుంచి రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీ



**పాటూరు(,కోవూరు) మే 30ప్రభాతవార్త :** రేషన్ కార్డు దారులకు నిత్యావసర సరుకులను జూన్ 1వ తేది నుంచి డీలర్లు పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ నిర్మలానంద బాబా అన్నారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో ఉన్న చౌక డిపోను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాపులో షాపుకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేసి అందులో స్టాకు వివరాలు, ధరల వివరాలు తప్పక నమోదు చేయాలన్నారు. షాపు పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వృద్ధులకు ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేసేలా డీలర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు.ఈ సదర్భంగా ఆయన పాటూరు డీలర్ భాస్కర్‌కు పలు సూచనలు చేశారు.

## ధాన్యం మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి



**కోవూరు, మే 30ప్రభాతవార్త :** రైతాంగానికి ఎన్నో విధాలుగా ఆదుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరపై పున: పరిశీలన చేసి ధాన్యం మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బుధవారం 2025-26 ఖరీఫ్‌కు సంబంధించి 14 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. పప్పు ధాన్యాలు, ఇతర పంటలకు మద్దతు ధరను 5 శాతం నుంచి 10 శాతం వరకు పెంచారన్నారు. కానీ రాష్ట్రంలో అత్యధికంగా పండించే వరి ధాన్యంకు మద్దతు ధరను కేవలం 3 శాతం మాత్రమే పెంచారన్నారు. గత ఏడాది క్వింటాల్‌కు 110 రూపాయలు పెంచిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కేవలం 69 రూపాయలు మాత్రమే పెంచిందన్నారు. గత ఏడాది వరి సాగు ఖర్చు ఎకరానికి 30 వేలు ఖర్చు కావడం జరిగిందని, ఈ ఏడాది ఆ ఖర్చు 40 వేలకు పెరిగే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వాస్తవిక పరిస్థితులను, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పరిగణలోకి తీసుకుని వరి ధాన్యంకు ప్రకటించిన కనీస మద్దతు ధరపై పున: పరిశీలన చేసి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు మరో 300 పెంచి ధాన్యం పండించే రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కొన్ని అధ్యయనాల ప్రకారం క్వింటాల్ వరి ధాన్యం ఉత్పత్తికి జాతీయ సగటు వ్యయం 3135 రూపాయలు కాగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర 2369 మాత్రమే ఉందన్నారు. దేశంలో రైతాంగానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర విషయంలో ఉదారంగా వ్యవహరించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన సేవలు



**కోవూరు, మే 30ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న పెట్రోల్ బంక్ పనులను శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సీతారామపురం, సంగం మండలాల్లో సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పడుగుపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఇనమడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్‌లో నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌లను అందించాలనే ధ్యేయంతో ఈ సొసైటీ ముందుకు సాగుతుందన్నారు. జూన్ నెలలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతవాసులు సొసైటీ మీద నమ్మకం పెంచుకుని పెట్రోల్ బంక్ కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలన్నారు. ప్రస్తుతం పడుగుపాడు సహకార సొసైటీ జిల్లాలోనే ఆదర్శ సొసైటీగా ముందుకు సాగుతందన్నారు. ఈ సందర్భంగా ఆయన పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు నాణ్యతగా వేగవంతం చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ ఉద్యోగులు, రైతులు ఉన్నారు.

## ఆర్‌టీఈ కింద ప్రైవేట్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలు



**కోవూరు, మే 30ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్‌టీఈ చట్టం కింద పేద ప్రజలకు 46 ఉచిత సీట్లను ఈ చట్టం ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, దీనిని తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రహీమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు పూర్తిస్థాయిలో సహకరించి 1వ తరగతిలో 46 మంది విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు ఆర్‌టీఈ చట్టం కింద ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు తల్లిదండ్రులు తమ ఉచిత ప్రవేశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాల జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు.

## వైభవంగా శ్రీ సాయి దర్బార్ 20 వార్షికోత్సవ వేడుకలు



**నెల్లూరు,మే30 ప్రభాతవార్త-విద్య** శ్రీ సాయి దర్బార్ 20వ వార్షికోత్సవ వేడుకలను నేటి నుండి రెండు రోజుల పాటూ వైభవోపేతంగా నిర్వహించనున్నామని శ్రీసాయి దర్బార్ అద్దాల మందిరం నిర్వాహకులు మధుసాయి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేడు ఉదయం 9 గంటల నుండి ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి అని సాయి నామ సంకీర్తనలు, బాబాకి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. అలాగే జూన్1వ తేదీ ఉదయం 9 గంటల నుండి శ్రీ దేవీ భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరుపనున్నామన్నారు. విశేష పుష్పాలంకరణ, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాలు, అన్నమయ్య సంకీర్తనలు, పందరి భజనలు, కోలాటాలతో కడు రమణీయంగా ఈ వేడుకలను జరుగనున్నాయన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు కష్ణగిరి దేశ్‌పాల్ సింగ్ దంపతులు దాతలుగా వ్యవహరించి అన్న ప్రదాన వితరన చేయనున్నారని, భక్తులు, పుర ప్రజలు అందరూ విశేషంగా పాల్గొని కళ్యాణాన్ని వీక్షించి , స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించాలని ఆయన కోరారు. అనంతరం కళ్యాణ వేడుకలను సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయన గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య, బాబీ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వంద పడకల ఆస్పత్రిగా సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రతిపాదనలు

### జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ పరిమళ



**కోవూరు, మే 30ప్రభాతవార్త :** కోవూరులోని ఈ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా పెంపుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, దీనికి సంబంధించి ఆస్పత్రిలో స్థాయి పెంపుదల చేసేందుకు అవసరమైన మౌళిక వసతులు ఉన్నాయా లేవా అనే విషయాన్ని పరిశీలించ˘డం జరిగిందన్నారు. అదేవిధంగా ఆస్పత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేలా ఆస్పత్రి సూ పరింటెండెంట్ ఎప్పటికప్పుడు చొరవ తీసుకోవాలన్నా రు. ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉంటేనే రోగులు కూ డా బాగుంటారన్నారు. ఈ ఆస్పత్రి స్థాయి పెంపుదల చేస్తే ప్రజలకు 24/7 వైద్య సేవలు అందుతా యన్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లీలావతి, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ సలావుద్దీన్, డాక్టర్ మైనుద్దీన్, హెడ్ నర్సు ప్రసూనలత, ఫార్మాసిస్ట్ నరసింహులు, ల్యాబ్ అసిస్టెంట్ కిషోర్, ఉన్నారు.

## కండలేరు ఇఇగా జి.రామచంద్ర మూర్తి



**కండలేరుడ్యాం(రాపూరు),మే30ప్రభాతవార్త** కండలేరు జలాశయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.రామ చంద్రమూర్తి నియమితులైనారు. గతంలో ఇక్కడ ఇఇగా పనిచేస్తున్న పి. విజయ కుమార్ రెడ్డి సాధరణ బదిలీలలో బాగంగా మరోచోటికి బదిలి అయ్యారు. దీంతో ఆయన స్దానంలో జి. రామచంద్రమూర్తిని కండలేరు ఇఇగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## బుచ్చి వెలుగు కార్యాలయంలో

### అంతర్జాతీయ మాసోత్సవాలు






**బుచ్చి మే 30 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం ఎపిఎం శ్రీదర్ నేతృత్వంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ నుండి యోగా ట్రైన ర్, హోమియోపతి డాక్టర్లు పొదుపు మహిళల చేత యోగాసానాలు వేయించారు. అనంతరం వారు యోగా గురించి వివరించారు. అన్ని ఆరోగ్య సమస్యలకు యోగా పరిష్కారమని అన్నారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరు ఒత్తిడితో కూడిన జీవితం సాగిస్తున్నారని అన్నారు. జీవితంలో వ్యాయామం లేకుండా నానా ఇవస్థలు పడుతున్నారని దీనికి పరిష్కారం యోగా తోనే సాధ్యమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం ఒక అర్ధ గంట యోగా చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో యోగా ఆవశ్యకతను వివరిస్తు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఇ పెంచలయ్య, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.








## ఆనం దంపతులతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి భేటీ



**నెల్లూరు కలెక్టరేట్, మే 30, ప్రభాత వార్త** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్ లో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మని నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీ, నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం పలు అంశ్యాలు పై చర్చించారు.

## నేడే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌లు పంపిణీ కార్యక్రమం

### - డిఆర్డిఏ పిడి నాగరాజ కుమారి



**నెల్లూరు కలెక్టరేట్, మే 30, ప్రభాతవార్త** మే నెల, ఎన్టీఆర్ భరోసా, సామాజిక పెన్షన్ లు పంపిణీ కార్యక్రమము ఈ నెల లో 31 తేదీన శనివారము ఉదయము 7 గంటలకు మరియు జూన్ నెల 2 వ తేదిలలో నెల్లూరు జిల్లలో పెన్షన్, కార్యక్రమం జరుగుతుందని డిఆర్డిఏ పీడీ నాగరాజుకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 304827 పెన్షన్‌లకు గాను రూ. 1323912000లను, బయోమెట్రిక్ అతంటికేషన్ ద్వారా మే నెల 31 వ తేది మొదటి రోజున పంపిణి 99ను పూర్తి చేయాలని , ఎంపీడీవో, ఎంసీలను కోరారు. మిగిలిన ఫించనులను 2 వ తేదీ కూడా పంపిణీ పంపిణీ చేయాలని, ఎంపీడీవో ఎంసిలకు సూచనలు ఇవ్వడం జరిగింది అన్నారు. అలాగే స్పౌస్ పెన్షన్లులు జూన్ నెల 12వ తేదిన పంపిణి జరుగుతుంది కాబట్టి పెన్షన్ తీసుకొంటూ మరణించిన కుటుంబ యజమాని భార్యకు (మరణించిన వారికి మాత్రమే ) వర్తించును గనుక అర్హత కలిగిన వారు ఎంపీడీఓకు అర్హత వివరములను సమర్పించి నమోదు చేసుకోన వలసినదిగా డీ ఆర్ డీ ఏ పీడీ నాగ రాజకుమారి ఓ ప్రకటన తెలియజేసారు.

## కలెక్టరేట్లో కారుణ్య నియామకాలు



**నెల్లూరు కలెక్టరేట్, మే 30, ప్రభాతవార్త** కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వో ఉదయ భాస్కర్, ఏవో విజయ్ కుమార్ చేతుల మీదగా ఇద్దరు మహిళలకు కారుణ్య నియామకాలు పత్రాలు అందించారు. వీరిలో పి.యశస్విని, డి/ఓ లేట్ పి.శేషయ్య, స్పెషల్ సర్వేయర్ జూనియర్ అసిస్టెంట్‌గా రెవెన్యూకు కేటాయించబడగ, మరియు వి.విజయ, డబ్ల్యూ/ఓ ఎ.మహేష్, పోలీస్ కానిస్టేబుల్ వాచ్ వుమన్‌గా నియమితులయ్యారు. డబ్ల్యూడిఏ విభాగానికి కేటాయించబడ్డారు.

## చికెన్ వ్యర్థాల వాహనాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**సంగం మే 30 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు వద్ద అక్రమంగా తరలిస్తున్న చికెన్ వ్యర్థాల వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో 12 డ్రమ్ముల్లో చికెన్ వ్యర్థాల ఉండగా పోలీసులు వాటిని గుంత తీసి పోడ్చి పెట్టారు.కేసు నమోదు చేశారు. నిత్యం సంగం మండలంలో పోలీసులు ఎన్ని దాడులు నిర్వహించినా,చికెన్ వ్యర్థాల వాహనాలు వస్తునే వున్నాయి. మండలంలోనికి చికెన్ వ్యర్థాల వాహనాలు పూర్తి స్దాయిలో రాకుండా మత్యశాఖ అధికారులు,పోలీసులు హెచ్చరికలు జారి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పొలం వివాదం - మహిళపై ఇనుపరాడ్లతో దాడి



**బుచ్చి మే 30 ప్రభాతవార్త** సంగం మండలం జెం డాదిబ్బ గ్రామానికి చెందిన పాటూరు ఆదిశేషమ్మ అనే మహిళపై పంచేడు గ్రామంలో పొలం వివాదంలో నాలుగురు వ్యక్తులు ఇనుపరాడ్లు, రాళ్ళతో దాడి చేయ సినట్లు ఆమె తెలిపారు. ఆమె ప్రస్తుతం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది.60 సెంట్ల దగ్గర వివాదం అని ఆమె తెలిపారు.గతంలో కూడా గొడవ జరిగిందని వారు పేర్కున్నారు. తమకు ప్రాణ హాని వుందని తమకు రక్షణ కల్పించాలని వారు కోరుతు న్నారు. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

## యోగాపై ప్రజల్లో మరింత అవగాహన అవసరం



**కోవూరు, మే 30ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగాపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ప్రజలు కూడా ఈ యోగాపై మరింత అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని పద్మజా ఆడిటోరియంలో యోగా గురువు సలీమ్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు సలీమ్ పలు ఆసనాలను వేసి ఉద్యోగులకు చూపించారు.

## రేషన్ సరుకులు దుకాణాల వద్ద పంపిణీ : తహశీల్దార్



**కొడవలూరు,మే30 ప్రభాత వార్త:** మండలంలో ఉన్న 37 రేషన్ దు కాణాల వద్ద రేషన్ సరుకులు ప్రజలకు డీలర్లచే పంపిణీ చేయ డం జరుగుతుందని స్థానిక తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొ న్నారు. మండలంలో ఉన్నటు వంటి అర్హులైన ప్రతి ఒక్క రేషన్ కార్డ్‌దారులు గ్రామాల పరిధిలో ఉన్న రేషన్ దుకాణాల వద్ద ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు 1వ తేదీ నుండి పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.

## మానవత్వం చాటుకున్న తహశీల్దార్ పి. స్వప్న



**ముత్తుకూరు, మే 30, ప్రభాతవార్త** మండలంలోని బ్రహ్మదేవం పంచాయి తీలోని లింగయ్యపాలెం తాళ్ళపూడి మధ్యలో ఆటోబోల్తా పడ డంతో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గా యాలు కా వడంతో ప్రభుత్వ కార్యాలయానికి వస్తున్న తహశీల్దార్ పి. స్వప్న గమనించి హు టాహుటిన సంఘటన స్థలా నికి వెళ్లి 108 వాహనానికి సమాచారం ఇచ్చి దగ్గరుండి క్షతగాత్రులను ఆసు పత్రికి తరలిం చారు. దీంతో అక్కడ ఉన్న ప్రజలు తహశీల్దార్‌ను అభి నందించారు.

## దహనశాల శంకుస్థాపనకు ఎమ్మెల్యేని ఆహ్వానించిన రోటరీక్లబ్



**కావలి, మే30 ప్రభాతవార్త** కావలి పట్టణం ఉత్తరశివార్లలోగల రోటరీ స్వర్గధామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నాలుగు దహనశాలల శంకుస్థాపన కార్యక్రమానికి కావలి ముసునూరులోని తెలుగు దేశంపార్టీ కార్యాలయం నందు కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని రోటరీక్లబ్ సభ్యులు శుక్రవారం ఆహ్వానించడం జరిగింది. ఈ రోటరీ స్వర్గధామంలో అంకినపల్లి రమేష్‌రెడ్డి సహకారంతో సుమారు నలభైలక్షల రూపాయలతో దహనశాలలు ఏర్పాటుచేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటికి రోటరీక్లబ్ ప్రతినిధులు తెలియచేశారు. నేడు ఉదయం 7:30 గంటలకు జరిగే దహనశాలల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా దగుమాటిని రోటరీక్లబ్ సభ్యులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కావలిశాఖ అద్యక్షురాలు స్వర్ణలత, సభ్యులు డాక్టర్ మాధవరెడ్డి, అంకినపల్లి రమేష్‌రెడ్డి, ఎం.రవికుమార్, రమేష్‌రెడ్డి, ఎంవివి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు మోటార్‌బైకులు ఢీఇద్దరికి తీవ్ర గాయాలు



సంగం మే30 ప్రభాతవార్త సంగం మండలం సిద్దీపురం జాతీయ రహదారిపైన రెండు మోటా ర్‌బైకులు ఢీకున్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి.వారిని వైద్య శాలకు తరలించారు. ఈ సంఘటనలో నెల్లూరుకి చెందిన రాచాల నాగరాజు (రామ్ కోటనగర్), కాగా మరో వ్యక్తిసంగానికి చెందిన బండి వెంకటేశ్వర్లు. తీవ్ర గాయాలు అయిన వీరిని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



**ఇందుకూరుపేట, మే30, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చాముండేశ్వరి అమ్మవారి 2025 బ్రహ్మోత్సవాలలో 28 మెంబర్లతో కలిగిన బ్రహ్మోత్సవ సేవా కమిటీ కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ సహాయ కమీషనర్ ఆదేశాల మేరకు ఈ బ్రహ్మోత్సవ సేవా కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి తాతా శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానం బ్రహ్మోత్సవ సేవ కమిటీ చైర్మన్‌గా గుండాల కృష్ణారెడ్డిని 28 మందితో కూడిన సేవా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగపట్నం పంచాయతీ వైస్ సర్పంచ్ కొండూరు వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో అందరూ సహకరించి సజావుగా లోటుపాట్లు లేకుండా జరిగేటట్లు సేవా కమిటీ పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొద్దుకూరు సుధీర్, కేతిరెడ్డి నారాయణరెడ్డి, బుజ్జి, మారబోయిన జనార్ధన్ గౌడ్, కంసాని మల్లిఖార్జునరెడ్డి, కర్పూరపు భాస్కర్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వినయ్, వంశీ నాయుడు, చింతల విజయ, దేవాలయం సిబ్బంది శరత్ నాయుడు, లలిత, పూర్ణిమ, ఇతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.